సంతోషం లేని జీవితం దండుగే: భట్టి

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): సంతోషం లేని జీవితం.. ఎన్ని సంపదలున్నా దండుగేనని, అది పరిపూర్ణ జీవితం కాబోదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు టీ వేణుగోపాల్‌రెడ్డి, ప్రముఖ రచయిత, జర్నలిస్టు విజయార్కె కలిసి రాసిన వ్యక్తిత్వ వికాస రచన 'హ్యాపీ లైఫ్' పుస్తకాన్ని ప్రజాభవన్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజానికి ఇలాంటి పుస్తకాల అవసరం ఉన్నదని, జీవితంలో సంతోషాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, టీఎస్పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

భట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మంత్రులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క, సినీనటుడు మురళీమోహన్ తదితరులు ప్రజాభవన్‌కు చేరుకుని ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గడువులోగా భూసమస్యల పరిష్కారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్దేశించి గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించారు.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించండి

సీఎంతో భేటీలో కేంద్రమంత్రి జయంత్ చౌదరి

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ఆదివారం సీఎం నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటుచేసి ఐటీఐలకు అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తిచేశారు. అంతకుముందు మంత్రి ఎన్‌సీఈఆర్టీని సందర్శించారు.

ఆరు ఎన్జీవోలతో విద్యాశాఖ ఒప్పందం

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూలు

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో పలు ఎన్జీవోలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకున్నది. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎన్జీవోల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను ప్రభుత్వం అందించనున్నది. నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతాకృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలోని ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నది.

బీసీలకు 42% కోటా ఇవ్వాల్సిందే

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్, కులగణన అంశం పచ్చి మోసం
- ఓట్ల కోసమే వివిధ పథకాల పేరిట కాంగ్రెస్ నాటకం
- బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో జైపాల్‌యాదవ్, కిశోర్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42% రిజర్వేషన్ కోటా ఇవ్వాల్సిందేనని, ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్, కులగణన పేరిట కాంగ్రెస్ పార్టీ బలహీనవర్గాలను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసమే రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ పథకాల పేరిట నాటకమాడుతున్నదని దుయ్యబట్టారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సివిల్ కాంట్రాక్టుల్లో బీసీలకు ప్రత్యేక కోటా, బీసీ సబ్‌ప్లాన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలుచేస్తామని, బడ్జెట్‌లో ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత మొండిచెయ్యి చూపుతున్నదని విమర్శించారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం కేంద్రానికి పంపించి చేతులు దులుపుకున్నదని దుయ్యబట్టారు. మోదీ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాన్ని కూడా తీసుకెళ్లని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు.

మంత్రి పదవుల్లో మొండిచెయ్యి

మంత్రివర్గ కూర్పులో బీసీలకు కాంగ్రెస్ సర్కారు మొండిచెయ్యి చూపిందని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. 60% ఉన్న జనాభాకు కేవలం మూడు మంత్రి పదవులు ఇచ్చి తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. బీసీ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యంలేని శాఖలు ఇచ్చారని ఆక్షేపించారు. తప్పులతడకగా నిర్వహించిన కులగణనను దేశానికే రోల్‌మాడల్ అని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఉద్దేశపూర్వకంగానే బీసీ జనాభాను తగ్గించి చూపి మోసం చేసిందని మండిపడ్డారు. రేవంత్ పాలనలో కులవృత్తులను నమ్ముకున్నవారికి బతుకుదెరువు కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. బలహీనవర్గాలు, బీసీ సంఘాలు సంఘటితమై రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

నోటీసులకు భయపడేదిలేదు

ప్రజా సమస్యలపై పదేపదే నిలదీస్తున్న కేటీఆర్‌పై కాంగ్రెస్ అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నదని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఇందులో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసిందని ఆరోపించారు. ఫార్ములా- ఈ రేసింగ్‌తో రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందని, రూ.వందల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. రేవంత్ సర్కారు మాత్రం ఫార్ములా-ఈ తెచ్చేందుకు కృషిచేసిన కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ నోటీసులకు బీఆర్ఎస్ భయపడబోదని, న్యాయస్థానాల్లో తేల్చుకుంటామని స్పష్టంచేశారు.

క్యాబినెట్ భేటీ నిర్వహించాలి: జైపాల్‌యాదవ్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై చర్చించేందుకు ప్రత్యేక క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దగా చేస్తున్నదని మండిపడ్డారు. బీసీ సంఘాలు సంఘటితమై రేవంత్ సర్కారు కుట్రలను తిప్పికొట్టాలని, స్థానిక ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌గౌడ్, ఉపేంద్ర పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- విభజన చట్టం ప్రకారమే అమరావతికి నిధులు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. స్థానిక సమస్యలే ఎజెండాగా ఎన్నికలను ఎదుర్కొంటామని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఇస్తున్న నిధులు, చేస్తున్న పనులను వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని పేర్కొన్నారు. బీజేపీ అధ్యక్ష పదవికి పోటీచేసేవాళ్లు రెండుసార్లు పార్టీ క్రియాశీల సభ్యుడై ఉండాలని తెలిపారు. అయితే ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచిన ఈటల రాజందర్‌కు ఈ నిబంధన వర్తించదని స్పష్టంచేశారు. విభజన చట్టం ప్రకారమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్రం నిధులు ఇస్తున్నదని ఆయన చెప్పారు.

వచ్చే నెలలో స్థానిక పోరు

మొదటిపేజీ తరువాయి...

కూడా అతిత్వరలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని ప్రకటించారు. ఆ తర్వాత తాను అలా చెప్పలేదంటూ ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర మంత్రులు చెప్పిన్న దాన్ని బట్టి జూలై చివరినాటికి ఎన్నికలు ముగించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే ప్రభుత్వవర్గాలు చాలాసార్లు లీకులు ఇచ్చాయి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి 17 నెలలు అవుతున్నది. మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు తీరి కూడా ఏడాది దాటింది. వీటికి నిధులు రాకపోవడంతో సమస్యల్లో కునారిల్లుతున్నాయి. ప్రత్యేక అధికారులకు సమస్యలపై ప్రజల నుంచి ఒత్తిడులు తీవ్రమయ్యాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సైతం బాధితులు తాకిడి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు సైతం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రికి పలు సందర్భాల్లో విన్నవించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, రాజీవ్ యువ వికాసం పథకాలు ప్రజావ్యతిరేకతను కొంత మేరకు తగ్గిస్తాయని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

రైతులను ప్రసన్నం చేసుకొని ఎన్నికలకు..

వారం రోజుల్లో వానకాలం రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి, రాజీవ్ యువ వికాస పథకాన్ని కొలిక్కి తీసుకొచ్చి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. సోమవారం జరిగే క్యాబినెట్ భేటీలో రైతుభరోసాకు నిధుల సమీకరణ, చెల్లింపులు, ఆరు గ్యారెంటీల అమలు తదితర అంశాల మీద చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 1.52 కోట్ల ఎకరాల సాగు భూమి సాగులో ఉన్నదని, ఎన్నికల సమయం కాబట్టి ప్రస్తుతానికి మొత్తం భూమికి రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం రూ.9,200 కోట్లు అవసరమని నిర్ధారించినట్టు సమాచారం. ఈనిధులు ఎలా సమీకరించాలని అనే అంశం మీదనే క్యాబినెట్‌లో ప్రధాన చర్చ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే రిజర్వుబ్యాంకు నుంచి రూ.3వేల కోట్ల అప్పు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, మరో రూ.4వేల కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. మిగిలిన డబ్బును ఎలా సమాకూర్చాలనే అంశం మీద మంత్రివర్గం చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 12,777

రాష్ట్రంలోని 12,848 గ్రామ పంచాయతీలకు 2019లో ఎన్నికలు జరిగాయి. వాటిలో 71 గ్రామాలు ఫ్యూచర్ సిటీలో విలీనమైనందున మిగిలిన 12,777 గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అంశంపై ఒక కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. బీసీలకు 42% రిజర్వేషన్ వ్యవహారం ఇంకా ఎటూతేలలేదు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ ఒత్తిడి వస్తే బీసీలకు 42% స్థానాల్లో చోటుకల్పిద్దామని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. గతంలో మహిళలకు 50% రిజర్వేషన్ అమలైనందున ఈసారి కూడా వారికి సగం సీట్లు దక్కనున్నాయి. గతంలో 2.02 కోట్ల జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుచేశారు. ఇప్పుడు కొన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమైనందున గ్రామీణ జనాభా 1.9 కోట్లకు చేరింది. ఈసారి బీసీలకు 20-22%, ఎస్సీలకు 18-20%, ఎస్టీలకు 8-10%, సీట్లు కేటాయించే అవకాశం ఉన్నది. రొటేషన్ అమలుకు చట్టం చేసినందున గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన స్థానాలు ఇప్పుడు మారే అవకాశం ఉన్నది.

వార్డుల బ్యాలెట్ పేపర్లు సిద్ధం

ప్రభుత్వం ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినా తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు చెప్తున్నారు. బ్యాలెట్ పేపర్లు సిద్ధంగా ఉంచామని, ఎన్నికల విధివిధానాల పుస్తకాలనూ ముద్రించినట్టు చెప్తున్నారు. ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల అంశాన్ని తేల్చి, ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించమంటే అప్పుడు వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నట్టు ఎన్నికల అధికారులు స్పష్టంచేస్తున్నారు.

42% ఇవ్వకుంటే బీసీలను మోసగించడమే: ఎమ్మెల్సీ దాసోజు

42% రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలను మోసగించడమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైందని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కను ప్రశ్నించారు. 'కులగణన జరిపించి, మేమెంతో మాకంత రిజర్వేషన్ ఇస్తామని నమ్మబలికి, మా ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చి బీసీలకు 42% రిజర్వేషన్ అమలుచేయకుండా స్థానిక ఎన్నికల ప్రస్తావన తేవడం.. దగా, మోసం, నయవంచన. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించకుండా, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే, రాజకీయ మూల్యం చెల్లించుకుంటారు. తస్మాత్ జాగ్రత్త' అని హెచ్చరించారు.

కరీంనగర్ కలెక్టర్‌కు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

కరీంనగర్ విద్యానగర్, జూన్ 15 : ఇప్పటివరకు ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యుల డెలివరీలు మాత్రమే ప్రభుత్వ దవాఖానలో జరగ్గా, మొట్టమొదటిసారిగా కరీంనగర్ కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన (జీజీహెచ్)లో సర్జరీ చేసుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. కలెక్టర్ పమేలా సత్పతి కొంతకాలంగా తీవ్ర తలనొప్పి, ముక్కు దిబ్బడ, నాసిక అడ్డంకి, సైనసైటిస్, శ్వాస ఇబ్బందితో బాధపడుతున్నారు. ప్రభుత్వ దవాఖానలో ఆదివారం ఆమె అత్యవసర 'ఎండోస్కోపీ నాజల్ సర్జరీ, సెప్టో ప్లాస్టి'ని చేయించుకున్నారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జీ వీరారెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు శస్త్రచికిత్సను దిగ్విజయంగా పూర్తిచేశారు.

కలెక్టర్‌కు మంత్రి అభినందన

ప్రభుత్వ దవాఖానలో శస్త్రచికిత్స చేసుకుని స్ఫూర్తిగా నిలిచిన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. కలెక్టర్ నిర్ణయం ఆమె చురుకైన న్యాయకత్వాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. చికిత్స చేసిన వైద్యులను అభినందించారు.

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్ జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు tgbie.cgg.gov.in, results.cgg.gov.in వెబ్‌సైట్లలో మార్కుల వివరాలు అందుబాటులో ఉంటాయని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి టీజీఈ సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్ జూన్ 15 (నమస్తే తెలంగాణ): టీజీఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 14లోగా స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో చేపట్టనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని టీజీఈసెట్-25 కన్వీనర్ వెల్లడించారు. అర్హత ఆధారంగా ఈ నెల 25లోగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కొత్త పంచాయతీల ఏర్పాటుకు బ్రేక్!

- మున్సిపాల్టీలు, కార్పొరేషన్లూ కష్టమే
- కేంద్రం నిర్ణయంతో తాత్కాలిక బ్రేక్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ నిలిచినట్టే.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటు కూడా ఇప్పట్లో లేనట్టే.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వాటికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్టయింది. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో జూన్ 30 తర్వాత చేసే ఏ భౌగోళిక పునర్వ్యవస్థీకరణను రాబోయే జనాభా లెక్కల కోసం పరిగణించబోమని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దాంతో ఈ నెల 30 తర్వాత కొత్త స్థానిక సంస్థల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయనున్నది. ఫలితంగా కొత్త పంచాయతీలు, మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటుకు మూడేండ్లపాటు బ్రేక్ పడనున్నది. వచ్చే 15 రోజుల్లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో కొత్త గ్రామాలు, మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం తెలపడం కష్టసాధ్యమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేసింది. కొత్త మండలాలను, కొత్త మున్సిపాలిటీలను, కొత్త కార్పొరేషన్లను కూడా సృష్టించింది. కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో, కొన్ని మున్సిపాలిటీలను కార్పొరేషన్లలో విలీనం చేసింది.

కొత్త గ్రామాలతో అదనపు ఆర్థికభారం

2026 జాతీయ జనాభా లెక్కలను కులగణనతో సహా 2025 జూన్ 30 నాటి పరిపాలనా పటం ఆధారంగా నిర్వహిస్తారు. ఈనెల 30 ఎన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉంటాయో వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. పంచాయతీరాజ్ శాఖ వద్ద ఇప్పటికే 250కిపైగా కొత్త గ్రామ పంచాయతీల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఇచ్చిన హామీలు పెద్ద సంఖ్యలో కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఆర్థిక పరిమితులు, ఇప్పటికే ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా లేని కారణంగా అనేక ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 'కొత్త స్థానిక సంస్థల ఏర్పాటు అంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం. గడువు నిర్ణయించినందున, వచ్చే మూడేండ్లపాటు కొత్త స్థానిక సంస్థలు లేదా రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన ఏ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేము' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

కొత్త మున్సిపాలిటీల ఏర్పాటూ కష్టమే

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపల ఉన్న 30 పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల పునర్వ్యవస్థీకరణతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న 13 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు ప్రత్యేక కసరత్తు జరుగుతున్నది. వార్డు డీలిమిటేషన్ ప్రక్రియ ఈ నెల 21 నాటికి పూర్తి కానున్నది. ఇది పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేస్తుంది. ఇటీవల మూడు కొత్త కార్పొరేషన్లు, 18 కొత్త మున్సిపాలిటీలు ప్రతిపాదించబడ్డాయి. 10కి పైగా మున్సిపాలిటీల ఏర్పాటు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, కేంద్రం విధించిన ఆంక్షల కారణంగా, జనాభా లెక్కల గడువుకు ముందు కొత్త మున్సిపాలిటీలు నోటిఫై చేసే అవకాశం దాదాపుగా లేదు. ప్రస్తుతం తెలంగాణలో 16 కార్పొరేషన్లతో సహా 151 మున్సిపాలిటీలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక లోటు ఈ సంవత్సరం రూ.6,700 కోట్లకు చేరినట్టు తాజా ఆర్థిక నివేదికలు తెలిపాయి. ఇది కొత్త సంస్థల ఏర్పాటును కష్టతరం చేస్తున్నది.

మరో నంది అవార్డుగా మార్చేశారా?

- గద్దర్ సినీ అవార్డుల ప్రదానం నటులు, నాయకుల వ్యవహారంగా మారింది
- అవార్డు జ్యూరీలో జానపద కళాకారులు ఎక్కడ?
- సర్కార్‌పై కంచ ఐలయ్య ఫైర్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తేతెలంగాణ): గద్దర్ సినీ అవార్డులను మరో నంది అవార్డుగా మార్చేశారా? అని గద్దర్ మిత్రుడు, ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణలో ఆడి, పాడిన వందలాది మంది కళాకారులు, ప్రజా గాయకులు, పాటల రచయితలను గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మరచిపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సినిమా నటులు, రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిందని ధ్వజమెత్తారు. 'నేను గద్దర్‌కు చాలా దగ్గరి మిత్రుడిని. గద్దర్‌ను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఒప్పించినవాడిని. నాతో సహా చాలామందికి ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందలేదు' అని ఆవేదన వ్యక్తంచేశారు. నేను రాహుల్‌గాంధీకి, తెలంగాణ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాను. అందుకు ప్రతిగా దూషణలు, బెదిరింపులు ఎదుర్కొంటున్నా.. అని తెలిపారు. గద్దర్ పేరిట అవార్డు ప్రకటించడం ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతిలో కొత్త విప్లవం మొదలవుతుందని భావించా, కానీ సినిమా రంగాన్ని ఏయే కులాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో, వారు తెలంగాణ సంస్కృతి పట్ల ఎలాంటి వైఖరితో ఉంటారో కూడా తెలుసునని పేర్కొన్నారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్న సినిమా సంస్కృతిని మార్చి, పూలే తరహా కొత్త తెలుగు సినిమా నిర్మాణ సంస్కృతిని తీసుకురావాలని ఆశించామని తెలిపారు. అటువంటి అంశాలు ఎక్కడా కనిపించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అవార్డు జ్యూరీలో ఒక్క జానపద కళాకారుడు కూడా లేడని, అందరూ సినిమా కళాకారులే ఉన్నారని, ప్రజల కళలకు ప్రాతినిధ్యం ఎక్కడ? జ్యూరీలో గద్దర్ సాంస్కృతిక ప్రతినిధి ఎక్కడ? పొడుస్తున్న పొద్దుమీద' అనే పాటకు ప్రాతినిధ్యం వహించే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కళాకారులు ఎక్కడ? అని ప్రశ్నించారు.

తల్లిదండ్రులతో జీవన్‌సాయికుమార్

నీట్‌లో తెలుగోడి సత్తా

- తెలుగు రాష్ట్రాల నుంచి ఫస్ట్ ర్యాంకు సాధించిన ఒకేఒక్కడు
- నారాయణ గైడెన్స్‌తోనే సాధ